క్లుప్తంగా

స్పందన సేవా సమితి అధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



పాయకాపురం(విజయవాడరూరల్): స్పందన సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం పైపులరోడ్డు జంక్షన్‌లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు(రిటైర్డు బీడీఓ)జయంతిని పురస్కరించుకొని స్పందన సేవా సమితి ప్రతినిధులు బాటసారులకు మజ్జిగతో పాటు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పందన సేవా సమితి ఫౌండర్, అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్, స్పందన వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వైకే శాస్త్రి, ప్రతినిధులు ఎస్.ప్రసాద్, షేక్ షఫీవుల్లా, మాదవరావు, హరినాథరావు, అనురాధ దంపతులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలో శనివారం ఎస్ఎస్ఎస్ కమ్యూనికేషన్స్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ పాల్గొని మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. జనార్దన్ మాట్లాడుతూ ప్రతీ ఏటా క్రమం తప్పకుండా వేసవిలో మజ్జిగను పంపిణీ చేస్తున్న ఎస్ఎస్ఎస్ కమ్యునికేషన్స్‌ను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షుడు దావా రవి, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జయరాజ్, నాగరాజు, నాయకులు డి.వెంకటేశ్వరరావు, రామారావు, నిర్వాహకులు గుండాల శ్రీనివాస్ కుమార్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు



పటమట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లాలోని మద్యం దుకాణాలు, బారుల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేశారు. శనివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ డి.చంద్రశేఖరరెడ్డి వివిధ బార్లు, మద్యం దుకాణాలు, వాక్ ఇన్‌స్టోర్‌లోని స్టాక్ వివరాలు, ఇండెంట్‌లు, బార్లు పాటించాల్సిన నియమాలను అమలు చేస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. అంతకు ముందు బార్లలోని మద్యం బాటిళ్ల శాంపిళ్లను సేకరించారు. తనిఖీల్లో ఆయన వెంట సీఐ వెంకట కృష్ణమూర్తి, ఎస్ఐ రమేష్, ఎస్ఐ వాసు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాబా మందిరంలో దత్తక్రియా యోగ తరగతులు ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శనివారం దత్తక్రియా యోగ తరగతులు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ బాబా మందిరంలో ప్రతిరోజూ సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటల వరకు ఉచిత దత్తక్రియా యోగ తరగతులు జరుగుతాయని తెలిపారు. ఆరోగ్య పరిరక్షణకు యోగ తరగతులు దోహదపడతాయని అన్నారు. కావున ఆసక్తి కలిగిన వారు మందిరంలో సంప్రదించాల్సిందిగా ఆయన సూచించారు. కార్యక్రమంలో మందిర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బాకీ తీర్చమని అడిగినందుకు దాడి చేశారంటూ గుణదల పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రసాదంపాడుకు చెందిన దూలం శ్రీనివాస్ చిన్నం నాయుడుతో కలిసి పండ్ల మార్కెట్‌లో వ్యాపారం చేశారు. వ్యాపారం సక్రమంగా సాగకపోవడంతో వ్యాపారం మానివేశారు. వ్యాపారం సమయంలో చిన్నం నాయుడు రూ. 20వేలు ఇవ్వాల్సి ఉంది. దీంతో శుక్రవారం రాత్రి బీఆర్‌టీఎస్ రోడ్డులో రూ. 20వేలు గురించి అడగ్గా చిన్నం నాయుడు నీకు నేను ఇవ్వవలసిన అవసరం లేదు, ఏం చేసుకుంటావో చేసుకో అంటూ దుర్భాసలాడి దాడి చేశాడంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యంపైఫిర్యాదు

మధురానగర్(విజయవాసడసెంట్రల్): కూల్‌డ్రింక్ కోసం ఇంట్లోంచి బయటకు వెళ్లిన తన కుమార్తె తిరిగి రాలేదంటూ గుణదల పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భానూనగర్‌కు చెందిన రాళ్లపూడి ఎల్లమ్మ గ్రాండ్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌ఉమెన్‌గా పనిచేస్తున్నారు. ఎల్లమ్మ ద్వితీయ కుమార్తె(14) శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు కూల్‌డ్రింక్ కోసం తల్లివద్ద రూ. 100 తీసుకుని బయటకు వెళ్లింది. కానీ ఎంతసేపటికీ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో చుట్టుపక్కల తెలిసిన వారి వద్ద విచారించినప్పటికీ ఫలితం లేకపోవడంతో గుణదల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



27వ డివిజన్‌లో ఫ్యాను గుర్తుపై ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే తమకు శ్రీరామరక్ష అని, సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబును తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 27వ డివిజన్ బావాజీపేటలో శనివారం కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని, అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. దారి పొడవునా మహిళలు, పలు పథకాల లబ్ధిదారులు తమకు సంక్షేమ పథకాలు అందాలంటే జగనన్న సీఎం కావాలని ఫ్యాను గుర్తుకు ఓటు వేస్తామని అన్నారు. మహిళలు హారతులు ఇస్తూ, శాలువాలు కప్పుతూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ చంద్రబాబు మోసపూరిత మేనిఫెస్టోని ప్రజల వద్దకు తీసుకువచ్చి మళ్లీ మోసం చేసేందుకు కుయుక్తులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. టీడీపీ మేనిఫెస్టోని ప్రజలు నమ్మడం లేదని, ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి బుద్దిచెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

టిడ్కో ఇళ్ల పేరిట దోపిడీ..

సెంట్రల్ నియోజకవర్గంలో గత టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్ల పేరుతో బొండా ఉమా ప్రజాధనాన్ని దోచుకున్నారని వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. అధికారంలో ఉండగా ప్రజలను పట్టించుకోకుండా అందినకాడికి దండుకోవడమే ధ్యేయంగా పనిచేశారని ఆరోపించారు. మళ్లీ నియోజకవర్గంలో బొండా ఉమా ప్రజల వద్దకు వచ్చి ఎలా ఓట్లు అడుగుతున్నారని మండిపడ్డారు. ప్రజాక్షేత్రంలో ధైర్యంగా ఓటు అడిగే అర్హత బొండాకి లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కురిటి శివ, శీలం భవానీరెడ్డి, లంక కుమార్, నల్లమల్ల ఆనంద్, కొల్లూరు రామకృష్ణ, యర్రంశెట్టి శ్రీనివాస్, మండ రాము, కొండాయగుంట రాము తదితరులు పాల్గొన్నారు.

58వ డివిజన్‌లో..



58వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కరోనా సంక్షోభంలో కూడా ప్రజలందరికీ సంక్షేమ పథకాలను గుమ్మం వద్దకే తీసుకువచ్చి అందించిన గొప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 58వ డివిజన్‌లో శనివారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించి మళ్లీ జగనన్న పాలనను చూసేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. చంద్రబాబు మాయమాటలు చెప్పడమే తప్ప.. ప్రజలకు ఎప్పుడు మంచి చేసింది లేదని విమర్శించారు. సీఎం జగన్ పథకాలను చంద్రబాబు కాపీ కొట్టి ఆయన మేనిఫెస్టోలో పెట్టారని, టీడీపీ మేనిఫెస్టోని కూటమి నేతలే పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని దుయ్యబట్టారు. సాధ్యం కాని హామీలతో చంద్రబాబు 2014లో ప్రజలను ఏవిధంగా అయితే మోసం చేశాడో మళ్లీ అదేవిధంగా మోసం చేయాలని చూస్తున్నారని అన్నారు. సంపద సృష్టిస్తానని చంద్రబాబు బోగస్ మాటలు చెబుతున్నారని, ఇది ఏమైనా హెరిటేజ్ కంపెనీనా.. అని ప్రశ్నించారు. గత టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్రాన్ని పూర్తిగా నాశనం చేసిన దుర్మార్గుడు చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. ఈ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ముందుకు వెళ్లాలంటే జగనన్న మరలా ముఖ్యమంత్రి కావాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు అవుతు శ్రీనివాసరెడ్డి, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించండి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



63వ డివిజన్ ఉడాకాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్) : విద్య, వైద్య రంగాల్లో నూతన ఒరవడులు తీసుకువచ్చి ఎన్నో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి నిండు మనస్సుతో ఆశీర్వదించాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 63వ డివిజన్ ఉడాకాలనీలో శనివారం ఆయన వెలంపల్లి సోదరుడు రాఘవ నరసింహారావుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు చెప్పినవన్నీ చేసి చూపామని అన్నారు. తమ ప్రభుత్వం సాధించిన విజయాలపై ఏ వేదికపైన అయినా తాను బహిరంగ చర్చకు సిద్ధమని సవాలు విసిరారు.

ఐదేళ్లలో రూ. 74.68 కోట్ల సంక్షేమం..

వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా డివిజన్‌లో ప్రతీ నెలా 2,482 మందికి ఇంటి వద్దకే లంచనగా పింఛన్ అందజేయడం జరిగిందని మల్లాది విష్ణు తెలిపారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 3,559 మంది అక్కచెల్లెమ్మలకు రూ. 12.72 కోట్లు, అమ్మ ఒడి ద్వారా 2,276 మంది తల్లులకు రూ. 8.92 కోట్లు, చేదోడు ద్వారా 223 మందికి రూ. 46.10 లక్షలు, ఈబీసీ నేస్తం ద్వారా 162 మందికి రూ. 39లక్షలు, జగనన్న విద్యాదీవెన ద్వారా 1,291 మందికి రూ. 3.24 కోట్లు, వసతి దీవెన ద్వారా 1185 మందికి రూ. 1.27 కోట్లు, కాపునేస్తం ద్వారా 187 మందికి రూ. 60లక్షలు, సున్నావడ్డీ ద్వారా 4,423 మందికి రూ. 1.69 కోట్లు, వైఎస్సార్ చేయూత ద్వారా 965 మందికి రూ. 3.60 కోట్ల సంక్షేమాన్ని డివిజన్ ప్రజలకు అందజేసినట్లు వివరించారు.

మోడల్ డివిజన్‌గా అభివృద్ధి..

గత ఐదేళ్లలో 63వ డివిజన్‌లో రూ. 15 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టి మోడల్ డివిజన్‌గా అభివృద్ధి చేసినట్లు మల్లాది వెల్లడించారు. రూ. 1.25 కోట్లతో హోసన్నా మందిరం రోడ్డు, రూ. 1.20 కోట్లతో డాక్టర్స్ కాలనీ రోడ్లను పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. ఈడబ్ల్యూఎస్ కాలనీలో రూ. 1.50 కోట్లతో రహదారులు నిర్మించుకోగా, రూ. 80లక్షలతో ఎల్ఐజీ-1,2, ఎంఐజీ-1 కాలనీల్లో రోడ్లు నిర్మించడం జరిగిందన్నారు. రూ. 1.20 కోట్ల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో రాధానగర్ కాలేజ్ రోడ్డు, ఎస్బీఓస్ ఈకాలనీ, విశాలాంధ్ర కాలనీ, షణ్ముఖకాలనీ ప్లాంట్ రోడ్డు, మాస్టర్ మైండ్స్ స్కూల్ రోడ్డు సహా అనేక రహదారులకు మోక్షం లభించినట్లయిందని చెప్పారు. విద్యుత్ సరఫరా మెరుగునకు విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం, పార్కుల నిర్మాణం, వాకింగ్‌ట్రాక్, గ్రీనరీ, చిన్నారులకు ఆట పరికరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

చంద్రబాబుకు పింఛన్‌దారుల ఉసురు తగులుతుంది..

ఇంటివద్దే పింఛన్ సొమ్ము అందకుండా అడ్డుకున్న చంద్రబాబుకు పింఛన్‌దారుల ఉసురు తగులుతుందని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. ప్రతినెలా ఒకటోతేదీ తెల్లవారుజామునే అవ్వాతాతలకు పింఛన్ ఇంటి వద్దనే అందేదని పేర్కొన్నారు. అది చూసి జీర్ణించుకోలేని చంద్రబాబు అండ్ కో ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసి వలంటీర్లను దూరం చేశారని మండిపడ్డారు. ఎర్రటి ఎండలో వృద్ధులు పింఛన్ కోసం రోడ్డు ఎక్కాల్సిన దుస్థితి వచ్చిందని, ఇందుకు చంద్రబాబు, నిమ్మగడ్డ రమేష్‌లే ప్రధాన కారకులని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావులను అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో డివిజన్ కోఆర్డినేటర్ పసుపులేటి యేసు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మేడా రమేష్, మోదుగుల గణేష్, సీహెచ్ రవి, టిక్కుం కృష్ణ, నాని, నాగిరెడ్డి, మాన్యం జగదీష్, యక్కల మారుతి, భోగాది మురళి, తిరుపతిరావు, నాగు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి



26వ డివిజన్ మాచవరంలో ఓట్లు అభ్యర్థిస్తున్న చక్రవర్తి



59వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ షాహీనాసుల్తానా

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల సమగ్ర అభివృద్ధి సాధ్యమని, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అండగా నిలవాలని వెలంపల్లి అల్లుడు మంచుకొండ చక్రవర్తి, కేశినేని నాని అల్లుడు కాజ రఘునాథం అన్నారు. స్థానిక 26వ డివిజన్ మాచవరంలో శనివారం మామయ్యల గెలుపును కాంక్షిస్తూ వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌ఛార్జి అంగిరేకుల గొల్లభామతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోని వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని శ్రీనివాస్(నాని), వెలంపల్లి శ్రీనివాసరావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పారా ప్రసాద్, కోలా నాగాంజనేయులు, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

59వ డివిజన్‌లో ప్రచారం..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావును గెలిపించాలని కోరుతూ 59వ డివిజన్‌లో ఆ పార్టీ నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా పాల్గొని మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చూడాలంటే ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, దేవిరెడ్డి రమేష్‌రెడ్డి, కొండా జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎస్‌జీ కమిషనర్‌గా రామగంగాధర్ నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): హిందుస్థాన్ స్కౌట్ - గైడ్స్ (హెచ్ఎస్‌జీ) రాష్ట్ర నూతన కమిషనర్‌గా దోర్నాసుల రామగంగాధర్ నియమితులయ్యారు. ఆయనను కమిషనర్‌గా నియమిస్తూ ఢిల్లీలోని జాతీయ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు హెడ్‌క్వార్టర్ కమిషనర్ మానికొండ శ్రీధర్ తెలిపారు. శనివారం గాంధీనగర్‌లోని హెచ్ఎస్‌జీ కార్యాలయంలో మానికొండ శ్రీధర్ ఉత్తర్వు కాపీని రామగంగాధర్‌కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్కౌట్ అండ్ గైడ్స్‌లో విద్యార్థులను భాగస్వాములను చేసి వారికి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పూర్వాభాద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని భీమనవారిపేటలోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామివారికి శనివారం పంచామృత అభిషేకాలు, అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, విశేష అలంకరణ, నాగవల్లిలతో అష్టోత్తర పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకుడు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి నిర్వహించారు.

అలరించిన భరత నాట్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై శనివారం పలువురు చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శన భక్తులను అలరించింది. విజయవాడకు చెందిన హేమంత్ బృందానికి చెందిన పలువురు చిన్నారులు చక్కటి హావభావాలతో నాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ప్రారంభమైన నాట్య ప్రదర్శనను ఆద్యంతం భక్తులు ఆసక్తిగా వీక్షించారు. అనంతరం చిన్నారులకు ఆలయ ఈఈ కె.ఎస్.రామారావు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి, ప్రత్యేక దర్శనం కల్పించారు.

కేంద్ర అదనపు బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర అదనపు బలగాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కేంద్ర అదనపు బలగాలు కవాతు నిర్వహించారు. శనివారం పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రైన్ వీధి నుంచి ప్రారంభమైన కవాతు పంజా సెంటర్, గొల్లపాలెంగట్టు రోడ్డు, వించిపేట ప్రాంతాల్లో జరిగింది. ప్రజలు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకునేందుకు అవసరమైన ధైర్యాన్ని, సంఘ విద్రోహ శక్తుల నిర్మూలించే దిశగా పోలీసులు సంసిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం స్థానికులతో సీఐ గణేష్ మాట్లాడుతూ.. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందన్నారు. పోలింగ్‌కు ముందు, పోలింగ్ రోజు, పోలింగ్ తర్వాత ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

ప్రజా ఆరోగ్యమే సీఎం జగన్ లక్ష్యం

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 63వ డివిజన్ రాజీవ్‌కాలనీలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి అనేక కార్యక్రమాల ద్వారా ప్రతీ ఇంటికి వైద్యాధికారులను పంపించి వైద్య సేవలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. రూ. 16,852 కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలలు, వివిధ సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్స్ నిర్మాణంతో పాటు నాడు-నేడు ద్వారా ప్రభుత్వ హాస్పిటల్స్ బలోపేతం చేసినట్లు వెల్లడించారు. కనుకనే నీతిఆయోగ్ విడుదల చేస్తున్న ఆరోగ్య సూచీల్లో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నట్లు తెలిపారు. అలాగే ప్రజలకు డిజిటల్ వైద్యసేవల కల్పనలోనూ, టెలీ మెడిసిన్ సేవల కల్పనలోనూ ఏపీ తొలిస్థానంలో నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 25లక్షలకు పెంచినట్లు తెలిపారు. విజయవాడ నగరంలో 29 ఆస్పత్రుల్లో పేదలకు ఆరోగ్యశ్రీ సేవలు అందుతున్నట్లు తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్య ఆసరా కింద రోగులకు ఆర్థిక సాయం కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత..

సెంట్రల్‌లో ఆరోగ్యశ్రీ కార్డులు కలిగి ఉన్న కుటుంబాలకు గత ఐదేళ్లలో రూ. 170 కోట్ల విలువైన వైద్య సేవలు అందించడం జరిగిందని ఎమ్మెల్యే మల్లాది అన్నారు. అలాగే నియోజకవర్గంలో నాలుగు నూతన అర్బన్ హెల్త్ సెంటర్లు రూ. 1.05 కోట్లతో అయోధ్యనగర్‌లో, రూ. 1.65 కోట్లతో ఇందిరానాయక్ నగర్, రూ. 1.20 కోట్లతో దేవీనగర్, మరో రూ.కోటి నిధులతో వాంబేకాలనీలో ప్రారంభించుకున్నట్లు తెలిపారు. హృద్రోగులకు అత్యవసర సమయంలో సేవలందించేందుకు గానూ జీజీహెచ్‌లో రూ. 45 వేలు ఖరీదు చేసే స్టెమీ ఇంజక్షన్‌లు సైతం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను నియోజకవర్గంలో 52,519 మంది సద్వినియోగపర్చుకున్నట్లు తెలిపారు. నిరుపేదల ఆరోగ్యానికి జగనన్న ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా భరోసా కల్పిస్తోందని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సెంట్రల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 2,243 మందికి రూ. 12.1 కోట్లకు సంబంధించి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసినట్లు తెలిపారు. అలాగే 211 మందికి రూ. 3.41 కోట్లకు సంబంధించి ఎల్ఓసీ పత్రాలను అందించినట్లు పేర్కొన్నారు.

సైకలాజికల్ కౌన్సెలింగ్‌తో సమాజ హితం

- ప్రముఖ వైద్యుడు డాక్టర్ సమరం
- స్పార్క్ కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభం



స్పార్క్ కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ సమరం

పటమట(విజయవాడతూర్పు): ప్రస్తుత సమాజంలో ఉన్న రుగ్మతలను సైకలాజికల్ కౌన్సెలింగ్‌తో తగ్గించే అవకాశం ఉందని వాసవ్య నర్సింగ్ హోమ్ అధినేత ప్రముఖ వైద్యుడు డాక్టర్ జి.సమరం తెలిపారు. బెంజిసర్కిల్‌లోని స్పార్క్ సైకలాజికల్ కౌన్సెలింగ్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైకాలజీ రంగంలో రాణించాలంటే సమాజంతో అనుబంధం పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సైకాలజిస్టుకు ఉండాల్సిన ప్రధాన లక్షణం మానవత్వం అని, సంపాదన కోసం కాకుండా సంతృప్తి కోసం పని చేసినప్పుడు వృత్తిలో రాణిస్తారని తెలిపారు. అనంతరం ఆయన కౌన్సెలింగ్ సెంటర్ ప్రధాన హాల్‌ను ప్రారంభించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సైకాలజీ ప్రొఫెసర్ టి.డి విమల కౌన్సెలింగ్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ విమల మాట్లాడుతూ.. నగరంలో కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభించిన సెంటర్ అధినేతలు రమేష్, కిషోర్‌లను అభినందించారు. అనంతరం థెరపీ రూమ్‌ను సైకాలజిస్ట్ సంఘం ఏపీఏ ఇండియా జాతీయ అధ్యక్షుడు బి.కృష్ణభరత్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కౌన్సెలింగ్ కోసం వచ్చే వారి సమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తుల కృషి చేయాలని సంస్థ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సెలింగ్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ బి.రమేష్, బి.కిషోర్, సైకాలజిస్టులు శ్రావణి కృష్ణకుమారి, రమాదేవి, పద్మావతి, ఏఎన్‌యూ సైకాలజీ విభాగం అధ్యాపకులు అనుపమ, కృష్ణమోహన్, ఏపీఏ ఇండియా కోశాధికారి తేజ, హైకోర్టు అడ్వకేట్ డాక్టర్ ఊ.ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణిపాల్ హాస్పిటల్‌లో హెర్నియాపై ముగిసిన వర్క్‌షాప్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మణిపాల్ హాస్పిటల్స్, అసోసియేషన్ ఆఫ్ వరల్డ్-రెనోవ్డ్ సర్జన్స్ కన్సార్టియం భాగస్వామ్యంతో విజయవాడలోని హోటల్ తాజ్ వివంతాలో రెండు రోజుల వర్క్ షాప్ విజయవంతంగా ముగిసింది. హెర్నియాకు సంబంధించి వైద్యరంగంలో తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలనే ఆసక్తి ఉన్న వైద్య నిపుణులు, పలువురు ఔత్సాహికులు ఈ వర్క్ షాపుకు హాజరయ్యారు. మణిపాల్ హాస్పిటల్స్‌లోని రోబోటిక్ సర్జన్ డాక్టర్ జె.సురేంద్ర మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జరిగిన ఈ వర్క్ షాప్ విజయవంతమైందని, దేశ నలుమూలల నుంచి 200 మంది వైద్య నిపుణులు పాల్గొన్నారన్నారు. 18 లైవ్ ఆపరేషన్లు(ఓపెన్, లాపరోస్కోపిక్, రోబోటిక్) జరిగాయని చెప్పారు. మణిపాల్ హాస్పిటల్స్ క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ కె.సుధాకర్ ఈ వర్క్ షాప్ ప్రాముఖ్యతను వివరించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సహకారంతో ఈ వర్క్‌షాప్ నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న మంజరాజపాల్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సాధారణ ఎన్నికల జిల్లా పరిశీలకురాలు మంజరాజపాల్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ఓటర్ల అవగాహన సదస్సును శనివారం ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మంజరాజపాల్ మాట్లాడుతూ.. కొత్తగా ఓటర్లుగా చేరిన విద్యార్థులు ఓటు వేయడాన్ని బాధ్యతగా గుర్తించాలన్నారు. ఇప్పటి వరకూ కౌమర దశలో ఉన్న విద్యార్థులు ఓటు హక్కు రావడంతో బాధ్యతయుతమైన పౌరులుగా మారారని తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకోవడం బాధ్యతగా తీసుకున్నప్పుడు మాత్రమే మంచి వ్యక్తులను ఎన్నుకోవడం, ప్రజాస్వామ్యాన్ని కాపాడిన వారమవుతామని చెప్పారు. ఎన్నికల రోజును పండుగగా జరుపుకోవాలన్నారు. విద్యార్థులు తమతో పాటుగా చుట్టూ ఉన్న సమాజాన్ని సైతం ఓటు విషయంలో జాగృతం చేయాలని సూచించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అధ్యక్షత వహించగా పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ కిరణ్మయి, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ సోమశేఖరరెడ్డి, స్వీప్ నోడల్ ఆఫీసర్ యు.శ్రీనివాసరావు, జిల్లా అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ చంద్రబోసు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు ఎస్.సాంబశివరావు, డి.పవన్‌కుమార్, కల్మాబేగం, కాంతిబాబు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చార్మినార్ ఎగ్జిబిషన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక పున్నమి ఘాట్ వద్ద గల బబ్బూరి గ్రౌండ్స్‌లో హైదరాబాద్‌లో ఉన్న చార్మినార్ నమూనాతో ఏర్పాటు చేసిన చార్మినార్ ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌ను శనివారం సాయంత్రం వ్యాపారవేత్త బబ్బూరి భూపాల్ లాంఛనంగా ప్రారంభించారు. మహిళల కోసం బెంగాలీ కాటన్ శారీస్, లక్నో శారీస్, నైటీస్, కాస్మొటిక్స్, గాజులు వంటి అనేక హ్యాండ్లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్ స్టాల్స్‌తో పాటు ఫుడ్ స్టాల్స్ కూడా ఏర్పాటు చేశామన్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు పోతుల కృష్ణ అయ్యప్ప మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం ఐదు నుంచి రాత్రి 10 గంటల వరకు ఎగ్జిబిషన్ ఉంటుందని తెలిపారు.